క్లుప్తంగా

విరాళాలు అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లిలో శ్రీరామ నవమి సందర్భంగా గ్రామంలో గల ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణోత్సవానికి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ రావుల జితేంద్రనాథ్‌రెడ్డి రూ.10,116, రావుల గోపాల్‌రెడ్డి రూ.10,116, బుగ్గపల్లి లక్ష్మీనారాయణ రూ.5,116 విరాళాలు ఆలయ నిర్వాహకులకు అందజేశారు. రాముల వారి కల్యాణోత్సవంలో భాగస్వాములు అయినందుకు ఆలయ నిర్వాహకులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శివనారాయణ, బాజ సిద్ధన్న, వడ్డె రాములు, కిషోర్, బక్క తిరుపతి, నర్సింహ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఆత్మకూర్: ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నందున వడదెబ్బ తగులకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని గ్రామీణ వైద్యుడు వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ మండలంలోని మూలమళ్లలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను లీటరు నీటిలో కలిపి నిత్యం తాగాలని సూచించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా బయటకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా గొడుగు, వాటర్‌బాటిల్ తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు, గ్రామపెద్దలు నారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, ఎల్లన్న, రాంరెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్ అరుణ, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

మొక్కల రక్షణకు గ్రీన్ నెట్ ఏర్పాటు



పాన్‌గల్: హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం కోసం ఊరూరా నర్సరీలు పెంచుతున్నారు. వేసవిలో ఎండలు పెరగడంతో మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కల రక్షణకు నర్సరీల్లో పచ్చని పందిళ్లు (షెడ్ నెట్) ఏర్పాటు చేశారు. ఎండలకు మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ నీడ ఏర్పాటుతో పాటు రోజు వాటరింగ్ చేస్తున్నట్లు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు పేర్కొంటున్నారు.

పంటల రక్షణకు రైతుల అగచాట్లు



వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్ వద్ద బోరుబావుల కింద వరి పంటను సాగు చేసుకున్న రైతులు పంటలు చేతికి వచ్చే దశలో పలు రకాలు పక్షుల వల్ల వాటిల్లుతున్న నష్టంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పొట్ట దశలో ఉన్న వరి పంటలపై పక్షులు వాలి గింజలను తినివేస్తుండడంతో వాటి నుంచి రక్షణ కోసం చీరలను రక్షణగా చుట్టుకోవడం, రాత్రివేళలో పెద్దపెద్ద బ్యాటరీ లైట్లను ఉపయోగించి పంట పొలం వద్దనే కావలి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

ఓటరు జాబితాలో పేర్లను సరిచూసుకోండి

పాన్‌గల్: ఓటరు లిస్టులో తమ పేరు ఉందో, లేదో ఒక్కసారి ఓటరు లిస్టులో సరి చూసుకోవాలని పాన్‌గల్ పంచాయతీ కార్యదర్శి రఘు శుక్రవారం ఒక ప్రకటనలో ఓటర్లను కోరారు. బీఎల్ఓల వద్ద ఉండే ఓటరు లిస్టులో పేర్లను సరి చూసుకోవాలన్నారు. ఓటరు లిస్టులో పేరు లేకపోతే ఈనెల 15వ తేదీ లోపు బీఎల్ఓల వద్ద కానీ, తహసీల్దార్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

దాయాదుల మధ్య ఘర్షణ: కేసు నమోదు

అమరచింత: ఇంటి ఎదుట బాత్‌రూం నిర్మాణ సమయంలో రెండు ఫీట్ల స్థలాన్ని కాజేశాడంటూ తనపై హన్మంతు అనే వ్యక్తి దాడిచేసి గాయపరిచాడని నాగల్‌కడ్మూర్‌కు చెందిన రవీందర్ ఫిర్యాదు చేశాడని ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌కు చెందిన రవీందర్, హన్మంతు దాయాదులు. రవీందర్ ఇంటి నిర్మాణ సమయంలో బాత్‌రూం కట్టేందుకు తనకు సంబంధించిన రెండు ఫీట్ల స్థలాన్ని వాడుకున్నాడని హన్మంతు శుక్రవారం వాదనకు దిగాడు. ఇరువురి మధ్య మాటమాట పెరగడంతో హన్మంతు రవీందర్‌పై కర్రతో దాడి చేయగా.. తలకు బలమైన గాయం అయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గోదాం నిర్వహణలో నిర్లక్ష్యం

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం
- ప్రతి ఏటా 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ
- పట్టర్ల జాలీలు తెరుచుకున్నా పట్టింపులేదు



మందుబాబులు పడేసిన మద్యం సీసాలు



తెరుచుకున్న గోదాం షట్టర్, జాలీలు

వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలో నిర్మించిన వ్యవసాయ గోదాం నిర్వహణలో అధికారులు చూపిస్తున్న నిర్లక్ష్యం కారణంగా మందుబాబులకు నిలయంగా మారింది. దీంతో ఎప్పుడు ఎలాంటి ఆపద ముంచుకురానున్నదో అని రైతులు ఆవేదన చెందుతున్నారు. రూ.మూడు కోట్లు వెచ్చించినా గోదాం నిర్వహణలో కనీస వసతులు కల్పించలేదు. ఊహించని ఘటనలు జరిగితే రూ.లక్షల్లో నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని గోదాంలో నిల్వ చేసిన వేలాది ధాన్యపు బస్తాల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రూ.మూడు కోట్లు ఖర్చు చేసి..

కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా 2018 సంవత్సరంలో రూ.మూడు కోట్లు ఖర్చు చేసి మండల కేంద్రానికి సమీపంలో 5 వేల మెట్రిక్ సామర్థ్యం గల వ్యవసాయ గోదాంను అధికారులు నిర్మించారు. ధాన్యపు నిల్వ కోసం 5 బ్యారెట్లను నిర్మించి ప్రతి సంవత్సరం ఈ గోదాంలో వరి ధాన్యాన్ని నిల్వ చేస్తారు. గోదాం నిర్మాణ సమయంలో సమీప రైతులు కొంత స్థలాన్ని ఉచితంగా ఇచ్చి గోదాం నిర్వహణలో తమకు ఉపాధి కల్పించాలని కోరారు. కానీ అధికారులు ఉపాధిని చూపించలేదు. గోదాంకు కూడా కంపౌండు వాల్‌ను కొంతమేర నిర్మించి అర్ధాంతరంగా వదిలేశారు.

మందుబాబులకు నిలయంగా..

గ్రామంలోని వైన్ షాపుకు సమీపంలో ఉన్న ఈ వ్యవసాయ గోదాంలో ప్రధాన గేటు 24 గంటలు తెరుచుకోనే ఉంటుంది. వాచ్‌మెన్ కోసం గదిని నిర్మించినా అది శిథిలావస్థకు చేరుకుంది. ఉదయం, సాయంత్రం వేళలో గోదాం వద్ద మందుబాబులు మద్యాన్ని తాగి ఖాళీ సీసాలను విచ్చలవిడిగా పగలగొడుతున్నారు. దీంతో అటువైపు వెళ్లే రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ యాసంగి సీజన్‌లో ధాన్యాన్ని సేకరించి నిల్వ ఉంచే సమయానికి గోదాంకు అవసరమైన అన్ని వసతులు కలిపించాలని మండల రైతులు కోరుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



వ్యవసాయ గోదాం ప్రాంగణం చుట్టుపక్కల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. మందుబాబులు గోదాంలోకి రాకుండా ప్రధాన గేట్‌లను మూసివేసి వాచ్‌మెన్‌ను నియమించాలి. షెట్టర్లకు ఏర్పాటు చేసిన ఇనుప జాలీలు తెరుచుకొని ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు ఈ విషయాన్ని గమనించి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గోపల్‌దిన్నె

ముందస్తు చర్యలు అవసరం



గోదాం నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రూ.లక్షల ఆస్తి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అనుకోని ఘటనలు జరగకముందే ముందస్తు చర్యలు తీసుకుంటే ప్రయోజనం కలుగుతుంది. అర్ధాంతరంగా నిలిపివేసి గోదాం కంపౌండ్‌ను వెంటనే నిర్మించాలి. ధాన్యం నిల్వల లెక్కలను సరిచూసేందుకు అవసరమైన సిబ్బంది, వాచ్‌మెన్‌లను వెంటనే నియమించాలి.

– బాల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి

ఆర్థికసాయం అందజేత



గాయపడిన వ్యక్తికి ఆర్థికసాయం అందజేస్తున్న టీఎమ్మార్ యువసేన నాయకులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త వెంకట్రాములు సాగర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానిక టీఎమ్మార్ యువసేన నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేలు పంపించాడు. టీఎమ్మార్ యువసేన నాయకులు వెంకట్రాములు పరామర్శించి, నగదును అందజేశారు. ఆపదలో ఉన్న వారికి నేనున్నానంటూ ముందుకు వచ్చి సాయం చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఎమ్మార్ యువసేన నాయకులు టైలర్ రవి, రామాంజనేయులు, నాగరాజు, నీలం రవి తదితరులు ఉన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం

ఖిల్లాఘనపురం: మండలంలోని రుక్కన్నపల్లిలో శుక్రవారం బొడ్రాయి పండుగ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆవాహిత దేవతా పూజలు, హోమాలు, వేదపారాయణం, ఊరేగింపు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం గ్రామంలో 8 గంటల నుంచి బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠామహోత్సవంతో పాటుగా హోమాలు, యంత్ర ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలు జరుగుతున్న ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.





దేవతామూర్తుల విగ్రహాలు

19 నుంచి బ్రహ్మోత్సవాలు

కొల్లాపూర్: పట్టణంలోని రామాలయంలో ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు రాఘవేంద్రాచార్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీరామ నవమి వేడుకల అనంతరం ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల్లో భాగంగా 21 వతేదీన సాయంత్రం ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం, 23 వతేదీన దేవతామూర్తులను రథోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కర్ణాటకకు తరలుతున్న ధాన్యం

- కొనుగోలు సెంటర్లకు రాని ధాన్యం
- ఇటీవల ప్రారంభమైన ఐకేపీ సెంటర్లు
- సరిహద్దులో ఉన్న పక్క రాష్ట్రానికే..
- ధర అధికంగా ఉండడంతోనే..
- ఐకేపీ సెంటర్ల వైపు కన్నెత్తి చూడని రైతులు



ధరూరు నుంచి డీసీఎంలో రాయచూరుకు తరలిస్తున్న వరి ధాన్యం

ధరూరు: కొనుగోలు సెంటర్లకు వరి ధాన్యం తీసుకొచ్చే నాథులే లేకపోవడంతో కొనుగోలు సెంటర్లు వెలవెలబోతున్నాయి. యాసంగిలో రైతులు సాగు చేసిన వరిపంటను రాయచూర్‌కు తరలించేందుకు మక్కువ చూపుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర తమకు గిట్టుబాటు కావడం లేదంటూ రైతులు పక్కనున్న కర్ణాటక రాష్ట్రం రాయచూరు మార్కెట్‌కు తరలిస్తున్నారు. అక్కడి వ్యాపారులతో పాటు ఈ ప్రాంత దళారులు రైతుల పొలాల వద్దకే నేరుగా వెళ్లి ధాన్యాన్ని తీసుకెళ్తున్నారు. వారం రోజులుగా పంట కోత ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో అమ్మకాలు కూడా అదే స్థాయిలో జరుగుతున్నాయి.

సరిహద్దులోనే కర్ణాటక..

ధరూరు, కేటీదొడ్డి మండలాల సరిహద్దులోనే కర్ణాటక రాష్ట్రం ఉంది. ఎండాకాలంలో నీటి సమస్య ఉంటుందని భావించిన ఈ ప్రాంత రైతులు ముందస్తుగా పంట సాగు చేసుకున్నారు. దీంతో పంట ముందుగానే రైతుల చేతికొచ్చింది. ప్రభుత్వం ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న ధాన్యానానికి గిట్టుబాటు ధరగా ప్రభుత్వం రూ.2,180గా నిర్ణయించింది. కర్ణాటకలో క్వింటాళ్లు 2,800 నుంచి రకాన్ని బట్టి 2,900 పలకడంతో ఇక్కడి రైతులు పక్కనున్న రాష్ట్రానికి పెద్దఎత్తున ధాన్యాన్ని తరలిస్తున్నారు.

స్పాట్ క్యాష్...

రాయచూరు మార్కెట్‌లో ధాన్యం అమ్మిన వెంటనే డబ్బులు చెల్లిస్తుండడంతో రైతులు అక్కడికే ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. పంట పెట్టుబడి కోసం, రసాయన ఎరువులు, పిచికారీ మందులు ఉద్దెర తెచ్చిన చోట చెల్లించడానికి సులువుగా ఉండడంతో రైతులు అక్కడ అమ్మేందుకు ఇష్టపడ్డారు. అమ్మిన రోజే 2పర్సంట్ తీసుకుని క్యాష్ వెంటనే చెల్లించినట్లు రైతులు చెప్పారు. అదే ధాన్యాన్ని ఇక్కడ అమ్మితే నెలల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెట్టెంపాడు ఎత్తిపోతల కింద తగ్గిన సాగు..

దరూరు మండలంలో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ఉంది. ఈ ప్రాజెక్టు కింద ఏడు రిజర్వాయర్లను నిర్మించారు. వీటి కింద ఏటా రెండు పంటలను రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ప్రధానంగా పత్తి, వరి, మిరప, ఇతర పంటలను సాగు చేసుకుంటారు. ఎడారి లాంటి నడిగడ్డ ప్రాంతం నెట్టెంపాడు జలాలతో సస్యశ్యామలం అయ్యిందని చెప్పవచ్చు. గతేడాది అంతంత మాత్రంగా కురిసిన వర్షాలతో ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. ఈసారి ఒక పంటకే నీళ్లివ్వడంతో రైతులు బోరు బావులు, ప్రధాన కాల్వ వెంట ఉన్న రైతులు పంటలను సాగు చేసుకుని పంటలు పండించుకున్నారు. మరి కొంత మంది రైతులు నీళ్లందక పంటలు ఎండిపోయాయి.

గతేడాది ఇదే సమయానికి కొనుగోలు చేసిన ధాన్యం

గద్వాల జిల్లాలో మొత్తం 998 మంది రైతుల నుంచి వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో మొత్తం 48 సెంటర్లకు గాను 35 సెంటర్లలో ధా న్యం కొనుగోలు. ఏ గ్రేడు రకానికి సంబంధించి 6వేల 382 క్వింటాళ్లు, బీ గ్రేడుకు సంబంధించి 101 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. మండలంలోని 18 సెంటర్ల ద్వారా 261.960 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. గతేడాది పీఏసీఎస్ ఆధ్వర్యంలో 23 సెంటర్లకు గాను 12 సెంటర్లను ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. 762 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు.

వడ్లను రాయచూరులోనే అమ్మా..



నేను రెండెకరాల్లో వరి పంట సాగు చేశాను. నా లుగు రోజుల క్రితమే పంటను కోత కోశాను. ప్ర భుత్వం ఇచ్చే ధర కంటే రాయిచూరులో మంచి రేటు వస్తుంది. క్వింటాళ్లకు 2,809 రూపాయలకు అమ్ముకున్నాను. డబ్బులు కూడా వెంటనే చెల్లించారు. పంట సగు కోసం తెచ్చిన అప్పులు కట్టుకున్నాను. పంట చివరి దశలో నటి కొరతతో గింజలు కొంత తాలుపోయింది.

– దావీదు, రైతు, ధరూరు

మద్దతు ధర పెంచాలి..



రైతులకు ఇచ్చే మద్దతు ధరను ప్రభుత్వం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి. పెరిగిన సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ధరలను పెంచే దిశ గా చర్యలు తీసుకోవాలి. తద్వారా పక్క రాష్ట్రానికి మన ధాన్యం వెళ్లకుండా టుంది. అదే విధంగా దళారుల నుంచి మోసపోకుండా ఉండేందు కు వీలు ఉంటుంది.

– పెంటన్న, రైతు, ధరూరు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం..



మండలంలో మొత్తం 18 సెంటర్లను ఈ నెల 4వ తేదీనే ప్రారంభించాం. గిట్టుబాటు ధర విషయంలో ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కంటే పక్క రాష్ట్రంలో అధికంగా ధరలు ఉండటంతో రైతులు సెంటర్ల వదక్కకు ధాన్యం తీసుకు రావడం లేదు. రైతులు ధాన్యం తీసుకు వస్తే కొనడానికి సిద్ధంగా ఉన్నాం.

– శోభారాణి, ఐకేపీ ఏపీఎం ధరూరు

మోదీ పాలనపై ప్రజలకు నమ్మకం



మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న బీజేపీ నాయకులు

ఆత్మకూర్: దేశ ప్రజలకు ప్రధాని మోదీ పాలనపైనే నమ్మకం ఉందని, ఆయనతోనే దేశాభివృద్ధి సాధ్యమని భారతీయ జనతా పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లో కార్యకర్తలతో కలిసి మహబూబ్‌నగర్ సభకు తరలివెళ్లారు. బూత్ స్థాయి అధ్యక్షుల సమావేశానికి పెద్ద ఎత్తున ఆత్మకూర్ నుంచి వెళ్తున్నామన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని, నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రి అవ్వడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తమ్మలి విజయ్, ఆనంద్‌కుమార్, బాలకృష్ణ, చిన్ననర్సింహ, రేచింతల శ్రీను, రాజు, ఎల్లన్న, బాలు, వెంకట్రాములు, విష్ణువర్ధన్‌రెడ్డి, సూరి, అశోక్, చందు, శ్యాం, లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లిలో కుంకుమార్చన పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సరస్వతీ దేవికి అభిషేకం, కుంకుమార్చన చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవిని దర్శించుకున్నారు. ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

వడ్డెర సంఘం ఏర్పాటు

పెద్దకొత్తపల్లి: మర్రికల్, నక్కలపల్లి గ్రామాల్లో గ్రామ వడ్డెర సంఘాలను ఏర్పాటు చేసినట్లు మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి రాజులు తెలిపారు. మర్రికల్ గ్రామ వడ్డెర సంఘం అధ్యక్షుడిగా సలేశ్వరం, ఉపాధ్యక్షుడిగా మల్లేష్, రాములు, ప్రధాన కార్యదర్శిగా మల్లయ్య, కోశాధికారిగా బాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెరల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. వడ్డెరల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడతామన్నారు. కార్యక్రమంలో మల్లేష్, మద్దిలేటి, నర్సింహ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బలిజపల్లి జంగమాయపల్లి ఉన్నత పాఠశాలలో 1994–95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం పాఠశాల ఆవరణలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 30 ఏళ్ల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. తరగతి గదుల్లో చేసిన అల్లరి పనులను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా నాడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులు శివాజీ, గురుమూర్తి, చిన్న రాములు, కరుణశ్రీని పూర్వ విద్యార్థులు సన్మానించారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



ఏకశిల గణపతి వద్ద ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి దంపతులు

బిజినేపల్లి: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిమ్మాజిపేట మండలంలోని ఆవంచ గ్రామ ఏకశిల గణపతికి ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలో వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఉత్సవానికి హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలన్నారు. గ్రామ అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో తిమ్మాజిపేట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇవ్వాలి



నాగసానిపల్లిలో ప్రచారం చేస్తున్న జిల్లా అధ్యక్షుడు నారాయణ

పెబ్బేరు రూరల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా ప్రయత్నం చేయాలని వనపర్తి జిల్లా బీజేపీ అధ్యక్షుడు నారాయణ కార్యకర్తలను కోరారు. భరత్‌ప్రసాద్ మద్దతుగా శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లిలో సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రిగా మూడో సారి నరేంద్రమోదీకి అవకాశం ఇవ్వాలంటే ప్రజలందరూ బీజేపీ మద్దతుగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, రాములు, విష్ణువర్ధన్, చరణ్, విరాట్, హరీష్ వీరబ్రహ్మం, విజయ్, లక్ష్మీనారాయణ, నరేందర్‌రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రవినాయక్

ఖిల్లాఘనపురం: వనపర్తి జిల్లా బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా ఖిల్లాఘనపురం మండలానికి చెందిన కెతావత్ రవినాయక్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అధ్యక్షుడు నారాయణ రవినాయక్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ మండలంతో పాటుగా వనపర్తి జిల్లాలో ఎస్టీలు ఎక్కువగా ఉన్నారని, వారంతా బీజేపీ కోసం పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలనను ప్రజలు దీవిస్తున్నారని చెప్పారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ గెలుపుకోసం నిరంతరం కృషిచేస్తామన్నారు

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. వెనికితండాకు చెందిన మాజీ సర్పంచ్ రాజునాయక్, నాయకులు హీరాలాల్, మాన్యలతో పాటు రోడ్డుమీదితండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు హర్యనాయక్, శంకర్, ఆయా తండాలకు చెందిన గిరిజన నాయకులు పలువురు శుక్రవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో అందరితో కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మండల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సాయిచరణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటయ్య, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణం పరిశీలన

పెద్దకొత్తపల్లి: మండలంలోని వెనచర్లలో మసీదు నిర్మాణం పనులను ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదు నిర్మాణం పనులు కాంట్రాక్టర్ నాణ్యతగా చేపట్టాలని సూచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అందరు సోదరభావంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ఖాజా, సలీం, కరీం, శంకర్, సలేశ్వరం తదితరులు పాల్గొన్నారు.